రాష్ట్రాన్ని ముంచెత్తిన వాన

● వివిధ ప్రమాదాల్లో ఆరుగురి మృతి ● చెన్నైకు మరింత చేరువలో దిత్వా తుపాను
● తీర ప్రాంతాల్లో ఆరు మీటర్ల మేర ఎగసిపడుతున్న అలలు
● తిరువళ్ళూరు జిల్లాలో కుంభవృష్టి ● చెరువుల నుంచి నీరు విడుదల


ఎన్నూరు తీరం

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తు న్నాయి. ముఖ్యంగా కావేరీ డెల్టా జిల్లాల్లో అతి భారీవర్షం కురిసింది. వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో తంజావూరు జిల్లాకు చెందిన రేణుక (20), ఆండిపట్టి సమీపంలోని చెక్కంపట్టికి చెందిన మణి (60), తూత్తుకుడి జిల్లాకు చెందిన పలవేశం (85), శీర్గాళి సమీపంలోని చెంబతనిఇరుంబు ప్రాంతానికి చెందిన ప్రతాప్ (19), తేని జిల్లాకు చెందిన రామయ్య (60) సహా ఆరుగురున్నారు. తంజావూరు, తిరువారూర్, మైలాడుదురై, నాగపట్టణం తదితర డెల్టా జిల్లాల్లో గత రెండు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది.

వారం రోజులుగా చేపల వేటకు దూరం

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తంజావూరుతో సహా నాలుగు జిల్లాల జాలర్లు వారం రోజులుగా సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళలేదు. నాగై జిల్లా అక్కరై నుంచి రెండు మరబోట్లలో సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళిన 18 మంది జాలర్లు తంజావూరు జిల్లాలోని సేతుపాసముద్రం ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్నారు. వర్షాల కారణంగా ఆదివారం కాశిమేడు ఫిషింగ్ హార్బర్ బోసిబోయింది. సముద్రంలోకి వెళ్ళిన జాలర్లకు కూడా చేపల వేట ఆశించిన స్థాయిలో సాగలేదు. దీంతో వారి తక్కువ చేపలతో తీరానికి తిరిగి వచ్చారు.

కుమరిలో వెనక్కి వెళ్ళిన సముద్రం

సాధారణంగా అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడినపుడు, తుపానులు సంభవించినపుడు సముద్రంలో అలలు తీవ్రంగా ఉంటాయి. అయితే, కన్నియాకుమారి జిల్లాలో సముద్రపు నీరు ఏకంగా వందడుగుల వెనక్కి వెళ్ళింది. అయితే, వివేకానంద మండపం, తిరువళ్ళూరు విగ్రహం మధ్య పడవ ప్రయాణానికి ఎలాంటి ఆటంకం ఏర్పడలేదు.

నిండిన 159 చెరువులు

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తిరువళ్ళూరు, చెంగల్పట్టు జిల్లాల్లో 159 చెరువులు నిండా యి. ఒక్క చెంగల్పట్టు జిల్లాలో 528 చెరువులు ఉండగా, వీటిలో 65 చెరువుల్లోకి పూర్తి సామర్థ్యంతో నీరు చేరింది. అలాగే, మధురాంతకం తాలూకాలోని 78 చెరువుల్లో 13 చెరువులు పూర్తిగా నిండాయి. తిరువళ్ళూరు జిల్లాలో 324 చెరువులుండగా, ఇందులో 94 చెరువులు నిండా యి. మరోవైపు తిరువళ్లూరు జిల్లాలోని అనేక ప్రాంతా ల్లో ఆదివారం తేలికపాటి వర్షం కురిసింది. పొన్నేరిలో గరిష్ఠంగా 5.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చెన్నైకి వంద కిలోమీటర్ల దూరంలో...

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను కడపటి వార్తలు అందేసరికి చెన్నై నగరానికి వంద కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైవున్నట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ తుపాను చెన్నై మీదుగా ఆంధ్రప్రదేశ్ వైపు పయనించి రాగల 24 గంటల్లో తీరం దాటవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇదిలా ఉండగా దిత్వా ప్రభావంతో చెన్నై నగరంలో ఆదివారం తేలికపాటి జల్లులు పడుతూనే ఉన్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగరానికి తాగునీటిని సరఫరా చేసే పుళల్, చెంబరంబాక్కం, పూండి, రెడ్‌హిల్స్ తదితర జలాశయాల నుంచి నీటిని విడుదల చేశారు.

స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు : మంత్రి కేకేఎస్ఎస్ఆర్

దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో చిక్కుకుని పోయిన రాష్ట్ర వాసులను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి లంకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొస్తామనితెలిపారు. అలాగే, దిత్వా కారణంగా ఏర్పడే ఎలాంటి విపత్కరపరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

అల్లకల్లోలంగా సముద్రం

దిత్వా తుపాను కారణంగా చెన్నై, కడలూరు, పుదుచ్చేరిలో సముద్రం అల్లకల్లోలా కనిపిస్తోంది. ముఖ్యంగా ఎన్నూరు హార్బరులో అలలు ఆరు మీటర్లకుపైగా ఎగసిపడుతున్నాయి. అలాగే కడలూరు, పుదుచ్చేరి తీర ప్రాంతాల్లో జాలరి గ్రామాల్లోకి సముద్రపునీరు చేరింది. దీంతో జాలర్లను సురక్షిత ప్రాంతాలతో పాటు తుపాను సహాయక కేంద్రాలకు తరలించారు. మరోవైపు నగరంలోని మెరీనా, బీసెంట్ నగర్ బీచ్‌ల్లోకి ఆదివారం పర్యాటకులను అనుమతించలేదు.


రామేశ్వరంలో జనావాసాల్లోకి చేరిన వరదనీరు

వర్షపునీటిలో రామేశ్వరం రైల్వే స్టేషన్

రామనాథపురం జిల్లా రామేశ్వరంలో అతి భారీ వర్షం కురిసింది. దీంతో రామేశ్వరం రైల్వే స్టేషన్ నీట మునిగింది. వర్షపు నీరు చేరడంతో 91 గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. అలాగే, తిరుచ్చి జిల్లాలో పూరి గుడిసెలు కూలిపోయాయి. మరికొన్ని ఇళ్ళు ధ్వంసమయ్యాయి. తంజావూరు, తిరువారూర్, నాగపట్టణం, మైలాడుదురై జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో బాధితులను సహాయక శిబిరాలకు తరలించారు. ఈ నాలుగు జిల్లాల్లో ఒకే రోజు వందకుపైగా గృహాలు కూలిపోయినట్టు అధికారులు వెల్లడించారు.

ఇకపై అది ‘మక్కల్ భవన్’

‘రాజ్ భవన్’ పేరు మార్పు ● గవర్నర్ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం



చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్ నివాస భవనం పేరు మారిపోయింది. ‘రాజ్ భవన్’ పేరు ‘మక్కల్ భవన్’గా మారింది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా రాష్ట్రాల గవర్నర్లు నివాసముండే రాజ్‌భవన్‌ను ‘పీపుల్స్ భవన్’ గాను, కేంద్రపాలిత ప్రాంతాల ప్రథమ పౌరుడైన లెఫ్టినెంట్ గౌవర్నర్ నివాసం ‘రాజ్ నివాస్’ను ‘పీపుల్స్ నివాస్’గా మారుస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఐతే ఇందుకు తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవియే ప్రధాన కారణం కావడం విశేషం. గత ఏడాది ఆగస్టులో ఢిల్లీలో జరిగిన గవర్నర్ల మహానాడుకు అధ్యక్షత వహించిన ఆర్ఎన్ రవి.. అక్కడ ప్రత్యేక ప్రతిపాదన చేశారు. రాజ్‌భవన్‌లను పీపుల్స్ భవన్‌గా పేరు మార్చాలని ఆయన కేంద్రాన్ని కోరారు. తాను రాజును కాదని, తాను నివశించేది రాజమహల్ కాదని, రాజ్‌భవన్‌లు ప్రజలకు సేవ చేసే కార్యాలయాలుగా వుండాలని సూచించారు. దీనిని పరిశీలించిన కేంద్ర హోం శాఖ నవంబరు 25న నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ మేరకు ప్రభుత్వం ఆదివారం దానిని అమలులోకి తెస్తూ ఉత్తర్వులిచ్చింది. దాంతో రాజ్‌భవన్‌లన్నీ పీపుల్స్ భవన్‌లుగా మారిపోయాయి. దీంతో రాష్ట్ర రాజ్‌భవన్‌ను ఇకపై ‘మక్కల్ భవన్’గా పిలవనున్నారు. దీని గురించి గవర్నర్ సలహాదారు తిరుజ్ఞాన సంబంధం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో.. తన సిఫారసును ఆమోదించిన కేంద్రానికి గవర్నర్ రవి కృతజ్ఞతలు తెలిపారన్నారు. తమిళనాడు కోరికను కేంద్రం అమలు చేయడం చరిత్రలో మైలు రాయిగా పేర్కొన్నారు. ఇకపై రాజ్‌భవన్ ‘మక్కల్ భవన్’గా పిలువబడుతుందని స్పష్టం చేశారు.

భవనం పేరు మారిస్తే సరిపోదు: స్టాలిన్ చురకలు

రాజ్‌భవన్‌ను మక్కల్ భవన్‌గా పేరు మారుస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ స్పందించారు. కేవలం రాజ్‌భవన్ పేరు మారిస్తే సరిపోదని, ఆలోచనా తీరులోనూ మార్పు రావాల్సిన అవసరముందని చురకలంటించారు. “పేరు మార్పు కంటే ఆలోచనా విధానంలో మార్పు రావాలి. శాసనసభ..ప్రజల సభ! శాసనసభను గౌరవించని వారు ‘ప్రజల సభ’గా మార్పు చేయడం కంటి తుడుపు చర్య కాదా? ప్రజాస్వామ్య తత్వశాస్త్రం కళ్లలో దుమ్ము దులపడానికా? ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలను, ప్రజాభీష్టాన్ని నెరవేర్చడానికి సౌర్వభౌమ శాసనసభను గౌరవించడం అవసరం! ఆలోచన, చర్యల్లో మార్పు లేకపోతే, ఇది కూడా అనవసరమే” అంటూ స్టాలిన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

డెల్టా జిల్లాల్లో మంత్రుల పర్యటన

● కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన డిప్యూటీ సీఎం ఉదయనిధి


రాడార్ కేంద్రంలో తుఫాన్ గమనాన్ని పరిశీలిస్తున్న ఉదయనిధి

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫానుతో రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అన్ని పంటలకు అపారనష్టం వాటిల్లిందని, ముఖ్యంగా కావేరీ డెల్టా జిల్లాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, ఈ ప్రాంతాల్లో ఒకటి రెండు రోజుల్లో ముఖ్యమంత్రి లేదా మంత్రులు పర్యటిస్తారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి వెల్లడించారు. దిత్వా ప్రభావం కారణంగా సహాయక చర్యలు, ముందస్తు ఏర్పాట్ల కోసం సూచనలు చేసేలా ప్యారీస్‌లోని ఎళిలగంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేయగా, దాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వరద ముంపు బాధితులతో కూడా మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆ తర్వాత ఆయన మీడియా మాట్లాడుతూ.. ఈ తుపాను కారణంగా డెల్టా జిల్లాల్లో అపారనష్టం వాటిల్లినట్టు సమాచారం వస్తుందన్నారు. దిత్వా కారణంగా చెన్నైలో కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, అందువల్ల నగరవాసులతో పాటు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్ష, వరద బాధిత ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న అన్ని రకాల చర్యలకు ప్రజలు పూర్తి సహాయ సహకారం అందించాలని ఆయన కోరారు. భారీ వర్షం కురిసిన జిల్లాల్లో 26 శిబిరాలను ఏర్పాటు చేసామని, ఇక్కడ ఇప్పటివరకు 1836 మంది బాధితులు ఆశ్రయం పొందుతున్నారని, వారికి అవసరమైన ఆహారం, తాగునీరు వంటి కనీస సౌకర్యాలను కల్పించామన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం 10 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, 1185 పడవలు సిద్ధంగా ఉంచామన్నారు. ఈ విపత్కాలంలో ప్రాణనష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం అన్ని రకాలైన చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటివరకు కురిసిన భారీ వర్షాల కారణంగా 20 వేల హెక్టార్లలో పంటలు నీట మునిగాయని, వరద ముంపు తగ్గిన తర్వాత దీనిపై పూర్తిస్థాయిలో గణాంకాలు సేకరిస్తామని డిప్యూటీ సీఎం ఉదయనిధి వివరించారు.

నేత్రపర్వంగా పంచమూర్తుల రథోత్సవం

● ‘హరోం హర’ నామస్మరణతో మార్మోగిన తిరువణ్ణామలై

వేలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ఆదివారం మహా రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తుల ‘హరోం హర’ దివ్య నామస్మరణతో తిరువణ్ణామలై నగరం మార్మోగింది. మొదట అన్నామలైయార్, ఉన్నాములై అమ్మవారు, పరాశక్తి, వినాయకుడు, వల్లి దేవసేన సమేత మురుగన్, చండీకేశ్వరుడు తదితర ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి, వేర్వేరు రథాల్లో ఆశీనులను చేశారు. మొదటిగా వినాయకుడి రథం, అనంతరం వల్లి దేవసేన సమేత మురుగన్ రథం కదిలాయి. ఈ రథాలు మాడవీధుల్లో తిరిగి కదిలిన స్థలానికి వచ్చిన అనంతరం, అరుణాచలేశ్వరుడు, ఉన్నామలై అమ్మవారి మహా రథం బయల్దేరింది. రథం ఒకవైపు పురుషులు, మరోవైపు మహిళలు లాగారు. ఈ రథం సుమారు 10 గంటలు మాడవీధుల్లో ఊరేగింపు చేసిన బయల్దేరిన స్థలానికి చేరుకుంది. అనంతరం పరాశక్తి రథం బయల్దేరింది. ఈ రథాన్ని మహిళలు మాత్రమే లాగారు. ఈ రథం వెనుకగా చండీకేశ్వరుడు రథం బయల్దేరగా, బాలురు, బాలికలు మాత్రమే రథాన్ని లాగారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.


రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం


తిరుమలలో ‘శ్రీభాగ్య’ అతిథిగృహం ప్రారంభోత్సవంలో గవర్నర్ ఆర్ఎన్ రవి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు మాజీ సభ్యుడు, ఎల్ఐసీ చెన్నై మాజీ ఛైర్మన్ ఏజే శేఖర్ తదితరులు


పండిత సత్కారం అందుకుంటున్న సందీప్‌శర్మ

తెలుగు ప్రబంధాల్లో తలమానికం

రామాభ్యుదయ కావ్యం

● శతావధాని డాక్టర్ తాతా సందీప్‌శర్మ

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లో ఒకరైన కడప జిల్లాకు చెందిన ‘అయ్యలరాజు రామభద్రుడు’ రచించిన ‘రామాభ్యుదయం’ కావ్య సౌందర్యం తెలుగు ప్రబంధాల్లో తలమాణికమని సుప్రసిద్ధి శతావధాని, సైన్స్ పరిశోధకులు (హైదరాబాద్), రాజమండ్రి వాసి డాక్టర్ తాతా సందీప్‌శర్మ అభివర్ణించారు. ‘వేద విజ్ఞాన వేదిక’ ఆధ్వర్యంలో ఆస్కా ప్రాంగణంలోని కృష్ణాహాలులో ఆదివారం జరిగిన ‘తరతరాల తెలుగు కవిత’ ఉపన్యాస ధారావాహిక 167వ ప్రసంగ కార్యక్రమంలో భాగంగా తాతా సందీప్‌శర్మ ‘రామాభ్యుదయ కావ్య సౌందర్యం’ అనే అంశంపై ప్రసంగించారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు వక్తను పరిచయం చేశారు. 30యేళ్ల ప్రాయంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాహిత్య రంగాల్లో రాణిస్తూ గత వారం రోజుల వరకు 75 అష్టావధానాలు, రెండు శతావధానాలు, 650కుపైగా ఉపన్యాసాలు పూర్తిచేసిన సందీప్‌శర్మను శాలువా కప్పి, జ్ఞాపిక, నూతన వస్త్రాలు బహూకరించి ఘనంగా సత్కరించారు. అనంతరం సభనుద్దేశించి సందీప్‌శర్మ మాట్లాడుతూ.. అయ్యలరాజు రామభద్రుడు రాసిన రామాభ్యుదయాన్ని శ్రీకృష్ణదేవరాయలు అల్లుడైన అళియ రామరాయల మేనల్లుడు గొబ్బూరి నరసరాజుకు అంకితమిచ్చారని గుర్తుచేశారు. అయ్యలరాజు సంస్కృతం, అచ్చతెలుగులో వర్షం గురించి చక్కగా వివరించిన గొప్ప వాతావరణ పరిశోధకులని, ఆ మహనీయుడి కావ్యాల్లో రసప్రధానాలుంటాయని, ముఖ్యంగా రామాభ్యుదయంలోని ప్రతి పద్యం అణిముత్యమని కొనియాడారు. 1500-1565 మధ్య కాలానికి అయ్యలరాజు వంశానికి చెందిన రామభద్రుడి రచనలు కనుమరుగయ్యాయని, అయితే సర్ సీపీ బ్రౌన్ వాటి ఆచూకీ కనుగొని పుస్తక రూపంలో సాహితీలోకానికి అందించి తెలుగు భాష మాధుర్యాన్ని చాటిచెప్పారని కీర్తించారు. అయ్యలరాజు రాసిన రామాభ్యుదయంలోని ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధములో ఎన్నో చమత్కారాలుంటాయని వివరించారు. అశోకవనంలో సీతమ్మను ఆంజనేయుడు కలిసినప్పటి మాటలని 14 పద్యాల రూపంలో అయ్యలరాజు అద్భుతంగా రాశారని, ఆయన కావ్యం మన జీవితంతో ముడిపడి ఉందన్నారు. మన పేర్లలో రామనామం ఉందని, కష్టాలు, ఆపద సమయాల్లో ‘రామచంద్ర’ అని అంటుంటామని, రామయ్య జీవితం మనందరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భాషాభిమానులు పాల్గొన్నారు.

శివకుమార్ తనయుడిగానే గుర్తింపు

● సూర్య



నటుడుగా కంటే శివ కుమార్ కొడుకుగానే తనకు గుర్తింపు అని హీరో సూర్య అన్నారు. సూర్య తండ్రి, సీనియర్ నటుడు శివకుమార్‌కు తాజాగా తమిళనాడు డాక్టర్ జె.జయలలిత సంగీత, కళల విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను సీఎం స్టాలిన్ ప్రదానం చేశారు. దీంతో సీఎంకు హీరో సూర్య కృతజ్ఞతలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. 'నా తండ్రి జీవితాన్ని చిత్రకారుడిగా ప్రారంభించారు. తన జీవితంతో పాటు పాటించాల్సిన మానవతా విలువలను జాగ్రత్తగా ప్లాన్ చేసుకున్న వ్యక్తికి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం చాలా సముచితం. ఇది ఆయన జీవితానికి, ప్రతిభకు తగిన గుర్తింపుగా మేము భావిస్తున్నాం. నా తండ్రి ఎత్తుపల్లాలను నా బాల్యం నుంచి చూస్తున్నాను. ఆయన దృఢ సంకల్పం, కృషి, క్రమశిక్షణ పాఠాలుగా, ఆదర్శంగా తీసుకున్నాను. ఆయన సాధించిన విజయాలకంటే ఆయన జీవిత విలువలే నా జీవితాన్ని, ఆలోచనలకు మార్గనిర్దేశం చేశాయి. నటుడిగా కంటే శివకుమార్ బిడ్డగానే నాకు గుర్తింపు' అని పేర్కొన్నారు.



'జీని'లో రవి మోహన్, కీర్తి శెట్టి, కళ్యాణి ప్రియదర్శిని

డిసెంబరు నెలాఖరుకు 'జీని'

డెబ్యూ డైరెక్టర్ అర్జునన్ దర్శకత్వంలో రవి మోహన్ నటిస్తున్న 'జీని' చిత్రాన్ని డిసెంబరు నెలాఖరులో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఐసరి డాక్టర్ కె.గణేష్ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై దాదాపు రూ.వంద కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. వేల్స్ నిర్మాణ సంస్థ నిర్మించే 25వ చిత్రం కావడంతో నిర్మాణ విలువల్లో ఏమాత్రం రాజీపడకుండా ఉన్నతమైన సాంకేతిక ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇందులో రవి మోహన్ సరసన కీర్తి శెట్టి, కళ్యాణి ప్రియదర్శిని, వామికా గోపి, దేవయాని తదితరులు నటించారు. నిజానికి సంక్రాంతికి సినిమా రిలీజ్ చేయాలని తొలుత భావించినప్పటికీ అగ్ర హీరోలు విజయ్ 'జన నాయగన్', శివకార్తికేయన్ 'పరాశక్తి', తెలుగులో చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి భారీ చిత్రాలు విడుదలకానున్నాయి. దీంతో కొత్త సంవత్సరానికి ముందుగా 'జీని'ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు ఓ నిర్ణయానికి వచ్చారు. ఈ విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన చేసి, ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

మూడో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో 'అనలి'

చిత్రజ్యోతి

మూడో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం 'అనలి'. సింథియా ప్రొడక్షన్ హౌస్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదలకానుంది. సింథియా లూర్దే ప్రధాన పాత్ర పోషించారు. నూతన దర్శకుడు దినేష్ దీనా దర్శకత్వం. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను సినీ దర్శకులు వెంకట్ ప్రభు, గణేష్ కె.బాబు తాజాగా రిలీజ్ చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమా గురించి దర్శకుడు దినేష్ దీనా మాట్లాడుతూ, 'ఈ స్క్రిప్ట్ మూడో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగుతుంది. ఆడియో, ట్రైలర్‌ను త్వరలోనే విడుదల చేస్తాం. భారతదేశ చలనచిత్ర చరిత్రలోనే పదివేల కంటైనర్లతో భారీ సెట్ నిర్మించి, అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని నిర్మించాం. ఇందులో శక్తివాసుదేవన్, సింథియా లూర్దే, కుమారవేల్, ఇనియా, కబీర్ దుగన్ సింగ్, అభిషేక్ వినోద్, బేబీ షిమాలి తదితరులు నటించారు.



'అనలి'లో ఓ దృశ్యం

'పరాశక్తి' డబ్బింగ్ షురూ



డబ్బింగ్ స్టూడియోలో శివకార్తికేయన్

సుధా కొంగరా దర్శకత్వంలో శివకార్తికేయన్, రవి మోహన్, అధర్వ, శ్రీలీల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'పరాశక్తి' చిత్రం డబ్బింగ్ ప్రారంభమైంది. ఇప్పటికే చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ మూవీ డబ్బింగ్ ఎపుడో ప్రారంభంకాగా అధర్వ, శ్రీలీల తమతమ పాత్రలకు డబ్బింగ్ పూర్తి చేశారు. తాజాగా హీరో శివకార్తికేయన్ తన పాత్రకు సంబంధించి డబ్బింగ్ మొదలుపెట్టారు. దీనికి సంబంధించి ఒక వీడియో సైతం ఆయన విడుదల చేశారు. ఇందులో డబ్బింగ్ స్టూడియోలో చెబుతున్న డైలాగులతో పాటు తన పాత్రకు సంబంధించి చిన్న సన్నివేశాలను కూడా జోడించారు. కాగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించే ఈ చిత్రం వచ్చే యేడాది జనవరి 14వ తేదీన విడుదలకానుంది.



ఆలయ ప్రాంగణంలో పోటెత్తిన భక్తులు

తిరుచెందూర్‌కు పోటెత్తిన భక్తజనం

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్‌లోని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో 50కి పైగా జంటలకు వివాహాలు జరిగాయి. అదేవిధంగా సెలవు రోజు కావడంతో రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు శనివారం సాయంత్రం నుండే ఈ క్షేత్రానికి చేరుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరిచి 4.30 గంటలకు విశ్వరూప దీపారాధనన శివాచార్యులు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు దీపారాధన, 6 గంటలకు ఉదయ మార్తాండాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కాగా, దర్శనం కోసం వెళ్లిన భక్తులు ముందుగా సముద్రంలో దిగి పుణ్యస్నానాలు చేసే సమయంలో అలలకు చిక్కుకోకుండా గజ ఈతగాళ్లతో పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో సుమారు 3 గంటలపాటు భక్తులు వేచివుండి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు, ఆమ్నీ బస్సులు తిరుచెందూరుకు ప్రత్యేక బస్సులు నడిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట మైదానంలో 'వేలూరు సంగమం' పేరుతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ వేడుకలను జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యూజిక్ పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన జానపద, గ్రామీణ కళా ప్రదర్శనలు, సంగీత కచేరి శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను కలెక్టర్ అభినందించి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ వలర్మతి, ఆ శాఖ అధికారులు హేమనాథన్, కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ విధానంతో మెరుగైన శస్త్ర చికిత్సలు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యుల బృందం

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గైనకాలజీ, అంకాలజీ, న్యూరాలజీ, థొరాసిక్, జీర్ణసంబంధిత సమస్యలు, కాంప్లెక్స్ జనరల్ సర్జరీలో రోబోటిక్ విధానం మరింత మెరుగైనదని బిల్‌రోత్ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ రాజేష్ జగన్నాథ్ పేర్కొన్నారు. మెరుగైన శస్త్ర చికిత్స, ఖచ్చితత్వం కోసం మాడ్యులర్ రోబోటిక్ హైడెఫినేషన్ 3డీ ఇమేజింగ్ కలిగిన ఆధునిక ఎస్ఎస్ఐ యంత్ర వ్యవస్థను బిల్‌రోత్‌లో శనివారం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రోబోటిక్ సర్జరీల గురించి డాక్టర్లు దీప, జయలక్ష్మి, శివరాజ్, పద్మకుమార్, దివ్య, కుమరగురుపరన్, శంకరనారాయణన్, ఏసీ మణి, భరత్‌గురు, రాజేష్ జగన్నాథ్ వివరిస్తూ రోబోటిక్ విధానంతో మెరుగైన చికిత్సలు అందించవచ్చని పేర్కొన్నారు.

తిరుపరప్పు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో ప్రధాన పర్యాటక ప్రాంతమైన తిరుపరప్పు జలపాతంలో వారం రోజుల అనంతరం ఆదివారం పర్యాటకులను స్నానాలకు అనుమతించారు. కన్నియాకుమారి జిల్లాలో గత రెండు వారాలకు పైగా కురుస్తున్న భారీవర్షాలకు జిల్లాలోని జలాశయాల్లో నీటిమట్టాలు పూర్తిసామర్థ్యానికి పెరిగాయి. వీటిలో ప్రధాన డ్యాం పేచ్చిపారై డ్యాం నీటిమట్టం 45 అడుగులకు దాటింది. దీంతో ముందస్తు జాగ్రత్తల చర్యల కింద డ్యాం గేట్లను ఎత్తివేసి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో తిరుపరప్పు జలపాతంలో నీటి ఉధృతి బాగా పెరిగింది. జలపాతంలో పర్యాటకులు స్నానాలు చేయకుండా నిషేధించింది. ఈనేపథ్యంలో శనివారం నుండి కన్నియాకుమారి ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి మళ్లీ పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. ఇదిలా వుండగా, తిరుపరప్పు కొండపై నుండి నీరు జారిపడుతున్న ప్రాంతంలో వారం రోజుల తర్వాత స్నానాలకు అనుమతించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



అరుణాచలేశ్వరుడికి రజత రథోత్సవం



వెండి రథంపై ఉత్సవమూర్తులు

వేలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి అరుణాచలేశ్వరుడు సహా ఉత్సవమూర్తులు వెండి రథంలో విహరించారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవాలు గత నెల 24వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఉత్సవమూర్తులు వివిధ రకాల వాహనాల్లో విహరిస్తున్నారు. ఈ క్రమంలో, ఆరవ రోజైన శనివారం రాత్రి పంచమూర్తులు అన్నామలైయార్, ఉన్నాములై అమ్మవారు, వినాయకుడు, పరాశక్తి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, చండీకేశ్వరుడు ప్రత్యేక అలంకరణంలో, వేర్వేరు వెండి రథాల్లో విహంచారు.

మూడు రోజుల టాస్మాక్ దుకాణాలు బంద్...

కార్తీక దీపోత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరవుతున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా, తిరువణ్ణామలైలో ఈ నెల 2,3,4 తేదీల్లో టాస్మాక్ దుకాణాలు మూసివేయాలని జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీచేసింది.

స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతోనే ఇస్రో పరిశోధనలు

● దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములవ్వాలి ● డాక్టర్ నారాయణన్




విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తున్న డాక్టర్ వి.నారాయణన్

తిరువళ్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇస్రో పరిశోధనల్లో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యం పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఇస్రో, స్పేస్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలోని వేల్ టెక్ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిలుగా రినాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డేబాసిస్ నియోగి, సిలికాన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ గ్లోబల్ హెడ్ అనిల్ కెంపన్న పాల్గొనగా, ముఖ్య అతిధిగా హాజరైన నారాయణన్ విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని రాకెట్లను ప్రయోగించి విజయం సాధించినప్పటికీ, విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం వినియోగిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అన్ని రాకెట్ ప్రయోగాలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ దేశాలతో పోల్చితే రాకెట్ ప్రయోగ విజయాల శాతంలో భారతదేశం మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలంలో ఫోటోలు తీయడానికి ఇబ్బంది కరంగా ఉందని, భవిష్యత్తులో వేసవిలో మాదిరిగానే ఫొటో వచ్చే విధంగా రాకెట్ ప్రయోగాన్ని శాస్త్రవేత్తలు తయారు చేస్తున్నారని త్వరలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గతంతో పోల్చితే ప్రస్తుతం వర్షపాత నమోదు, తుపాను ప్రభావాల సమాచారం వాతావరణ శాఖకు రాకెట్‌ల ద్వారా స్పష్టంగా అందుతుందని తెలిపారు. విపత్తు నిర్వాహణ విభాగానికి ముందస్తు చర్యలు చేపట్టేందుకు కీలక సమాచారం అందించే దిశగా రాకెట్ ప్రయోగాలు తుది దశలో ఉన్నాయని త్వరలో వాటిని అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. రాకెట్ ప్రయోగాల్లో ప్రపంచ దేశాలతో భారతదేశం పోటీ పడుతుందని, అందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయం అభినందనీయమన్నారు. ఎందులోను మన దేశం తక్కువ కాదనే అభిప్రాయాన్ని విదేశాలకు వెళ్లాలనుకొని విద్యార్థులు బలంగా నమ్మాలని సలహా ఇచ్చారు. దేశంలో అంతరిక్ష పరిశోధనలను వేగవంతం చేసే పనిలో భాగంగా రూపొందుతున్న భారతీయ అంతరిక్ష కేంద్ర(బీఏఎస్) 2035నాటికి కార్యరూపం దాల్చుతుందని,మొదటి రాకెట్ ప్రయోగం 2028 నాటికి ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఈ స్నాతికోత్సవంలో 3074 మంది విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనకు నారాయణన్ చేసిన అద్భుతమైన కృషికి గాను వేల్ టెక్ యూనివర్శిటీ తరఫున డాక్టర్ ఆఫ్ సైన్స్ బిరుదు అందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● తిరువణ్ణామలై కార్తిక దీపోత్సవాలు..

నేడు భరణి దీపం, మహాదీపం దర్శనానికి ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విడుదల

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ కార్తీక దీపోత్సవాల్లో ప్రధాన వేడుక మహాదీపం ఈ నెల 3వ తేది జరుగనుంది. దీప సందర్శనకు ఉచితంగా, రుసుముతో భక్తులను అనుమతిస్తుంటారు. ఆ ప్రకారం, 3వ తేది ఉదయం 500 మంది మాత్రమే దీపం సందర్శించేందుకు అనుమతించనున్నారు. అందుకు రుసుము రూ.500 నిర్ణయించారు. ఆ రోజు సాయంత్రం మహా దీపం దర్శనానికి ఆలయంలో ప్రవేశించేందుకు వంద మందిని రూ.600లు, వెయ్యి మందిని రూ.500 టిక్కెట్టుతో అనుమతించనున్నారు. టిక్కెట్లు ఆలయ వెబ్‌సైట్ https://annamalaiyar.hrce.tn.gov.inలో సోమవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. భక్తులు ఆన్‌లైన్ లో రుసుము చెల్లించి అనుమతి రసీదు పొందవచ్చు, దర్శన అనుమతి పొందేందుకు ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబరు, ఈ-మెయిల్ చిరునామా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆధార్ కార్డుకు ఒక టిక్కెట్టు మాత్రమే నమోదుచేసుకోవాలి. టిక్కెట్ నమోదుచేసుకున్న తర్వాత, రిజిస్టర్ మొబైల్ నెంబరుకు ఓటీపీ పంపిస్తారు. టిక్కెట్ రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించే వెబ్‌సైట్‌లో టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



మహా దీపం (ఫైల్‌ఫొటో)

ఒకేరోజు 25 ఆలయాలకు మహాకుంభాభిషేకం

● మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నాలుగున్నరేళ్లలో 3,865 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించామని, ఆదివారం ఒకే రోజు 25 ఆలయాల్లో మహాకుంభాభిషేకం జరిగిందని హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు తెలిపారు. కొళత్తూరు నియోజకవర్గంలోని అముదాంబిగ సమేత సోమనాథస్వామి ఆలయంలో నిర్వహించిన మహాకుంభాభిషేకంలో మంత్రి పాల్గొన్నారు. ఆ తర్వాత చూలైలో రూ.72లక్షలతో నూతనంగా నిర్మించిన వేంకటాచలపతి పరిపాలన సభ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2021లో ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటివరకు 3,865 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సంయుక్త కమిషనర్ మోహన సుందరం, ముల్లై, ధర్మకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా మారుద్దాం

● సీఎం స్టాలిన్

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రాన్ని హెచ్.ఐ.వి (ఎయిడ్స్) రహిత రాష్ట్రంగా మారుద్దామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇదే విషయంపై ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ఈ యేడాది అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిల్లో హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన ర్యాలీలను ఆగస్టు నెల 12 నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు నిర్వహించిందన్నారు. అలాగే, కాలేజీ విద్యార్థినీ విద్యార్థులకు రెడ్‌క్రాస్ సహకారంతో లైంగిక వ్యాధులపై అవగాహనా సదస్సులను నిర్వహించారన్నారు. కొత్తగా హెచ్‌ఐవీ కేసులు లేని రాష్ట్రంగా మారుద్దామని ప్రతి ఒక్కరం ప్రతిజ్ఞ చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ఎలాంటి తారతమ్యాలు చూపించకుండా సమాజంలో సమాన గౌరవమర్యాదలు ఇచ్చి వారు కూడా స్వేచ్ఛగా జీవించేలా సహకారం అందించాలని కోరుకుంటున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీవారిసేవలో గవర్నర్ రవి



తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుత్తణిలో గవర్నర్‌కు స్వాగతం

తిరుత్తణి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన గవర్నర్ ఆర్ఎన్ రవి తిరిగివస్తూ తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని ఓ హోటల్‌లో బస చేశారు. ఎస్పీ వివేకానంద శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి రమేష్ గవర్నర్‌కు స్వాగతం పలికారు. హోటల్‌లో భోజనం ముగించుకున్న అనంతరం గవర్నర్ చెన్నై చేరుకున్నారు.

సెంగోట్టయ్యన్ ఏకాకి

● ఎడప్పాడి పళనిస్వామి ఎద్దేవా

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) కండువా కప్పుకున్న సెంగోట్టయ్యన్ వెంట ఒక్క అన్నాడీఎంకే కౌన్సిలర్ కూడా లేరని, ఆయన రాజకీయాల్లో ఏకాకిగా మిగిలిపోతారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ ప్రచారయాత్ర చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభకు వెళ్లే ముందు ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. గోపిచెట్టిపాళయం నియోజకవర్గానికి ప్రత్యేకంగా రాజకీయ చరిత్ర ఉందన్నారు. 1980 జనవరిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే-కాంగ్రెస్ కూటమి గెలిచిందని, ఆ సమమయంలో ఎంజీఆర్ నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం డిస్మిస్‌కు గురైందన్నారు. అదే సంవత్సరం మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరుఫున ఎంజీఆర్ ఈ స్థానం నుంచి తన ప్రచారానికి శ్రీకారం చుట్టారని, ఆ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించి రెండోసారి ముఖ్యమంత్రి పీఠమెక్కి రికార్డు నెలకొల్పారన్నారు. ఎంజీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుండి సుమారు 50యేళ్లకు పైగా సెంగోట్టయ్యన్ అన్నాడీఎంకేలో కొనసాగారని, 9సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, పార్టీ పేరుతో ఈ స్థాయికి ఎదిగిన సెంగోట్టయ్యన్ పార్టీని వీడినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదన్నారు.

తుఫాను బాధిత ప్రాంతాల్లో....

దిత్వా తుఫాను వల్ల నష్టపోయే ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అన్నాడీఎంకే తరుఫున సహాయ కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా ఆ పార్టీ నియకులు, కార్యకర్తలకు ఈపీఎస్ సూచించారు.

సమాచార దృష్టి

నేటినుంచి గ్రూప్-1, 1ఏ మెయిన్స్

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1, 1ఏ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న మెయిన్స్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రూప్-1 విభాగంలో 70 పోస్టులు, గ్రూప్-1ఏలో రెండు మొత్తం 72 పోస్టుల భర్తీకి జూన్ 15వ తేది ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాలు ఆగస్టు 28న విడుదల చేయగా, 1,865 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైన వారు మెయిన్స్ రాయాల్సి ఉంది. ఆ ప్రకారం, మెయిన్స్ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం తమిళం అర్హత పరీక్ష జరుగనుంది. అనంతరం 2,3,4 తేదీల్లో గ్రూప్-1 పోస్టులకు పేపర్-2, పేపర్-3, పేపర్-4 పరీక్షలు, 8,9,10 తేదీల్లో గ్రూప్-1ఏ పోస్టుల మెయిన్స్ జరుగనుంది. ఈ పరీక్ష కోసం నగరంలో 19 కేంద్రాలు ఏర్పాటుచేశారు.

రేపు, ఎల్లుండి ఇంటి వద్దకే రేషన్

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'తాయుమానవర్' పథకంలో, ఈ నెల 2,3 తేదీల్లో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించనున్నారు. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రతాప్ ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబరు నెలకు సంబంధించిన రేషన్ సరుకులు మంగళ, బుధవారాల్లో అందించనున్నామని కలెక్టర్ తెలిపారు.

'ఈసీఐనెట్' యాప్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం మొబైల్ యాప్ ECiNetèþ$ అందరూ సులభంగా ఉపయోగించుకునేలా సవరించడానికి ప్రజలు అభిప్రాయాలు తెలియజేయవచ్చు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ అపూర్వకుమార్ సింగ్ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ప్రజలకు సులభతర సేవలందించేలా 'ఈసీఐనెట్' మొబైల్ యాప్‌ను ఎన్నికల సంఘం పరిచయం చేసిందన్నారు. ఈ యాప్‌ను మరింత సులభతరం చేసేలా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నామని తెలిపారు. ప్రజలు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, 'సబ్మిట్ సజెషన్స్' అనే ప్రాంతంలో ఈ నెల 27వ తేది వరకు వరకు అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు.

11వ తేదీ వరకు 'సర్'

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువు ఈ నెల 4వ తేదీతో పూర్తికానుందని ప్రకటించిన నేపథ్యంలో, ఈ నెల 11వ తేదీ వరకు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. సర్ పనులు రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో నవంబరు 4వ తేదీ ప్రారంభమయ్యాయి. జీసీసీ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో 3,718 మంది బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించి, పూర్తిచేసిన ఫారాలను ఎన్నికల కమిషన్ ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ పనులు ఈ నెల 4వ తేదీతో పూర్తవుతాయని ఎన్నికల కమిషన్ గతంలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో, పూర్తిచేసిన ఎన్యూమరేషన్ ఫారాలను అప్పగించే గడువును ఈ నెల 11వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ పొడిగించింది. ప్రజల నుండి స్వీకరించిన ఫారాలను బీఎల్వోలు ఈ నెల 15వ తేదీలోగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయవల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ముసాయిదా ఓటరు జాబితా డిసెంబరు 16న, తుది ఓటరు జాబితా 2026 ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు ఈసీ ప్రకటించింది.

థర్మల్ కేంద్రాల ఉద్యోగులకు శనివారం సెలవు

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): థర్మల్ కేంద్రాల ఉద్యోగులకు నెలలో రెండు, నాలుగో శనివారం సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. తిరువళ్లూర్, సేలం, తూత్తుకుడి జిల్లాలో ఐదు థర్మల్ విద్యుత్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రతి శనివారం పని దినం. కార్యాలయాలు, విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలకు రెండో శనివారం సెలవు కాగా, మిగిలిన శనివారాలు పనిదినాలు. 2018 నుంచి నాలుగో శనివారం కూడా సెలవు ప్రకటించారు. ఈ క్రమంలో, కార్మికుల కోరిక మేరకు, థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు రెండు, నాలుగో శనివారం సెలవు ప్రకటిస్తూ విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. అదే సమయంలో మిగిలిన రోజుల్లో ఉదయం 8.40 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉన్న పని వేళలు సాయంత్రం 5.45 గంటల వరకు పొడిగించినట్లు ఉత్తర్వుల్లో తెలియజేసింది.

అంగన్వాడీ కేంద్రాలకు సెలవు

● జిల్లా కలెక్టర్ ప్రకటన

తిరుత్తణి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దిత్వా తుపాను తీవ్రరూపం దాల్చడంతో తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలతో పాటు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ రెండ్రోజులు సెలవులు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆర్కే పేటలోని పలు అంగన్వాడీ కేంద్రాలు తెరిచి ఉండడంతో కలెక్టర్ ప్రతాప్ అధికారులకు ఫోన్‌చేసి మధ్యాహ్నం 2 గంటలకు పిల్లల తల్లిదండ్రులను అంగన్వాడీ కేంద్రాలకు పిలిపించి వారితో పంపించివేశారు.

నేడు 'ఆలూరి రామస్వామి.. ట్రస్ట్' ప్రారంభం

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రముఖురాలు, విద్యావేత్త, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ ఏవీ శివకుమారి తన తల్లిదండ్రుల పేరుతో 'ఆలూరి రామస్వామి పూర్ణావతి తెలుగు చారిటబుల్ ట్రస్ట్'ను సోమవారం ప్రారంభించనున్నారు. విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు ట్రస్టు ప్రారంభోత్సవం జరుగనుంది. 'తానా' పూర్వాధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై సంస్థను ఆవిష్కరించనున్నారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ శివకుమారి విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

డెల్టా జిల్లాల్లో మూడో రోజూ 'దిత్వా' ప్రభావం

● 1.63 లక్షల ఎకరాల్లో నీటమునిగిన పంట


దెబ్బతిన్న వరిపైరు చూపుతున్న రైతు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'దిత్వా' కారణంగా మూడో రోజు కూడా వర్షాలు కురవడంతో, సుమారు 1.63 లక్షల ఎకరాల్లో సంబా వరిసాగు నీటమునిగింది. ఆయా జిల్లాల్లోని శిబిరాల్లో సుమారు 1,000 మందికి ఆశ్రయం కల్పించారు. తుపాను కారణంగా శుక్రవారం రాత్రి ప్రారంభమైన వర్షం, శనివారం ఉదయం నుంచి రాత్రి, ఆదివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. భారీవర్షంతో జన జీవనం స్తంభించింది. నాగపట్టణం జిల్లాలో సుమారు 80వేల ఎకరాలు, మైలాడుదురై జిల్లాలో 20వేల ఎకరాలు, తిరువారూర్ జిల్లాలో 50వేల ఎకరాలు, తంజావూరు జిల్లాలో 11వేల ఎకరాల్లో సంబా వరి నీటమునిగింది. పొలాల్లో రెండు రోజులకు పైగా నీరు ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కారణంగా పలు గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి. రోడ్లపై మోకాలు లోతున నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆయా జిల్లాల్లో ముంపు ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మందిని నివారణ శిబిరాలకు తరలించి తాగునీరు, భోజనం వసతి కల్పించారు. తుపాను కారణంగా సముద్రపు అలల ఉధృతి, సముద్రంలో బలమైన గాలులు వీస్తుండడంతో, ముందు జాగ్రత్త చర్యగా జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని, చేపల వేటకు వెళ్లిన వారు వెంటనే తీరానికి చేరుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచించారు. భారీ అలల తాకిడికి పలు గ్రామాల్లో రక్షణ గోడలు దెబ్బతినగా, సముద్రంలో లంగరు వేసిన పడవలు తీరానికి కొట్టుకొచ్చాయి.

హైకోర్టులో 42 రోజుల్లో 13,625 కేసుల విచారణ పూర్తి


జస్టిస్ భరత్ చక్రవర్తి

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లకు పైగా విచారణలో ఉన్న 13,625 కేసులను 42 రోజుల్లో పూర్తి చేసి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరత్ చక్రవర్తి రికార్డు సృష్టించారు. విచారణలో ఉన్న కేసుల సంఖ్య తగ్గించేలా, మూడేళ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉండి మూడేళ్లకు పైగా విచారణలో ఉన్న కేసులు విచారణ ముగించేలా సుప్రీం కోర్టు తాముగా ముందుకొచ్చి విచారణ చేపట్టింది. అలాంటి కేసుల విచారణకు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరత్ చక్రవర్తి ప్రత్యేకంగా నియమితులయ్యారు. ఆ ప్రకారం, జిల్లా కోర్టుల నుంచి కేసులు మద్రాసు హైకోర్టుకు బదిలీ చేశారు. ఆ ప్రకారం, మూడేళ్ల శిక్షపడే అవకాశమున్న 20,985 కేసులను జిల్లా కోర్టుల నుంచి మద్రాసు హైకోర్టుకు పంపించారు. ఈ కేసులను ఆగస్టు 19వ తేది నుంచి ప్రత్యేక న్యాయమూర్తి భరత్ చక్రవర్తి విచారిస్తున్నారు. ఆ ప్రకారం అక్టోబరు 29వ తేది వరకు 42 పనిదినాల్లో 13,625 కేసుల విచారణ పూర్తిచేశారు. మిగిలిన కేసులను సంబంధిత కోర్టులు విచారించేలా తిరిగి పంపించారు. ఈ కేసులు పూర్తిచేసినందుకు ప్రభుత్వ న్యాయవాదులు ఎస్.సుకేంద్రన్, కస్తూరి, వినోద్ తదితరులు న్యాయస్థానానికి పూర్తి సహకారం అందించారని జస్టిస్ భరత్ చక్రవర్తి అభినందనలు తెలిపారు.

ఈసీకి వ్యతిరేకంగా రేపు చెన్నైలో, 4న ఢిల్లీలో నిరసన

● పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్



అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీఎంకే అధ్యక్షుడిగా తన కుమారుడు డాక్టర్ అన్బుమణిని ఎన్నికల కమిషన్ ప్రకటించడాన్ని నిరశిస్తూ ఆ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ వర్గం ఈ నెల 2న చెన్నైలో, 4వ తేదీ ఢిల్లీలో ఆందోళన చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు డాక్టర్ రాందాస్ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 46 ఏళ్ల క్రితం పార్టీని స్థాపించి, అన్ని వర్గాల ప్రజల కోసం అహరహం కష్టపడిన తనకు ఎన్నికల కమిషన్ తీవ్ర అన్యాయం చేసిందని, తన కష్టార్జితాన్ని పరుల పాలు చేసిందని రాందాస్ ఆరోపించారు. పీఎంకే అధ్యక్షుడిగా అన్బుమణిని తొలగిస్తే, ఆయనే 2026 ఆగస్టు వరకూ కొనసాగవచ్చని ఎన్నికల కమిషన్ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ఎన్నికల కమిషన్ మోసపూరితమైన చర్యగా ఆయన అభివర్ణించారు. అన్బుమణి మోసంతో తన నుంచి పార్టీని లాగేసుకున్నారని, ఇందుకు ఎన్నికల కమిషన్ సహకరించిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన ఈ చర్యను ప్రజలు అంగీకరించరని, ఈసీ చర్యను ఖండిస్తూ ఈ నెల 2వ తేదీ ఉదయం 10 గంటలకు చెన్నై కలెక్టర్ కార్యాలయం ఎదుట తమ వర్గం ఎమ్మెల్యే జీకే మణి నేతృత్వంలో ఆందోళన చేస్తుందని తెలిపారు. అనంతరం 4వ తేదీన ఉదయం 11 గంటలకు ఢిల్లీలో ఆందోళన చేపడతామని ప్రకటించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని తండ్రీకొడుకుల దుర్మరణం

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూరు సబ్‌వేలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తండ్రీకుమారులు దుర్మరణం పాలయ్యారు. గిండిలో ప్రభుత్వ మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద టిఫిన్ దుకాణం నడుపుతున్న రవి (50) అనే వ్యక్తి శనివారం రాత్రి కాయగూరల కోసం సైదాపేట మార్కెట్‌కు తన చిన్న కుమారుడు కార్తీక్ (15)ను తీసుకుని ద్విచక్రవాహనంపై వెళ్లాడు. వీరు తిరిగి వస్తున్న సమయంలో వర్షం కూడా పడుతోంది. వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి, కార్తీక్ తీవ్రంగా గాయపడి అక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఈపీఎస్ ప్రచార సభలో అపశ్రుతి

● ఒకరి మృతి

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయంలో ఆదివారం జరిగిన ఎడప్పాడి పళనిస్వామి ప్రచార సభలో ఓ వ్యక్తి స్పృహతప్పి మృతిచెందాడు. కొండయంపాళయం ప్రాంతానికి చెందిన అర్జునన్ (43) సభ మధ్యలో ఉన్న సమయంలో, హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే గోపిచెట్టిపాళయం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలో అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

కాంగ్రెస్ నేతల సమీక్షా సమావేశం


సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నిర్వాహకులు

తిరుత్తణి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)కి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులను ఎంపిక చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం నూతన ప్రక్రియ రూపొందించింది. రాష్ట్రంలోని 38 రెవెన్యూ జిల్లాల్లో గత వారం రోజులుగా పార్టీ కార్యకర్తలు, నిర్వాహకుల అభిప్రాయాలను తెలుసుకుని పార్టీపట్ల విశ్వాసం, అంకితభావంతో పనిచేస్తున్న వారి పేర్లను ఎంపిక చేసి ఆ జాబితాను అధిష్టానానికి పంపించాల్సివుంది. దీని కోసం ఆదివారం ఉదయం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి డివిజన్‌లోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దురైచంద్రన్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఏజీ.చిదంబరం నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలోని ప్రస్తుత పార్టీ నిర్వాహకులు, సీనియర్ నేతలు పాల్గొనగా, తిరుత్తణి పట్టణ అధ్యక్షుడు ఏలుమలై సభకు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా ఏఐసీసీ సభ్యుడు, పరిశీలకుడు పీఎం. సంపత్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి, పలు మండలాలకు సంబంధిచిన అధ్యక్ష పదవులకు పోటీ చేయదలుచుకున్న వారికి దరఖాస్తులను అందజేయగా, తిరువళ్లూరు జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తూ త్యాగరాజన్ దరఖాస్తుపత్రాన్ని సంపత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు వెంకటరాజ్ సహా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సెంగోట్టయ్యన్‌కు టీవీకేలో స్వేచ్ఛ ఉండదు

● ఎంపీ కార్తి చిదంబరం



ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ మంత్రి సెంగోట్టయ్యన్‌కు టీవీకేలో స్వేచ్ఛ ఉండదని శివగంగ కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం పేర్కొన్నారు. పుదుకోటలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సెంగోట్టయ్యన్ టీవీకేలో చేరడంపై పాత్రికేయులు ప్రశ్నించగా, కార్తి చిదంబరం సమాధానం చెప్పారు. సెంగోట్టయ్యన్ వెళ్లినందున అన్నాడీఎంకేలో చెప్పుకోదగ్గ మార్పు ఉండదని, ఆ పార్టీకి ఉన్న ఓటు బ్యాంకు చెక్కుచెదరదన్నారు. 50యేళ్లకు పైగా రాజకీయ అనుభవం కలిగిన సెంగోట్టయ్యన్ రాజకీయాలతో సంబంధాలు లేని విజయ్‌తో చేతులు కలపడం వల్ల టీవీకేకు ఒరిగిందేదీ లేదన్నారు. వాస్తవం చెప్పాలంటే ఆయన విజయ్ అడుగుజాడల్లో నడవాల్సిందే కానీ, స్వతంత్రంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేరని కార్తి అనుమానం వ్యక్తంచేశారు.

తిరువళ్లూరులో మరో ఇద్దరు యువతుల అదృశ్యం

తిరువళ్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్‌లో యువతుల అదృశ్యం కొనసాగుతోంది. ఇప్పటికే అదృశ్యమైన యువతుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. తాజాగా వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యం కావడం జిల్లా ప్రజలను ఆందోళనలకు గురిచేసింది. వెంగల్ గ్రామానికి చెందిన యువతి (20) ప్లస్ టూ పూర్తిచేసి ఓ కంపెనీలో పని చేస్తోంది. శుక్రవారం రాత్రి ఇంటిలో నిద్రించిన యువతి మరుసటిరోజు ఉదయం కనిపించలేదు. కుటుంబసభ్యులు వెంగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగూ మేలనూర్‌కు చెందిన యువతి (19) తిరునిండ్రవూర్‌లో ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. శుక్రవారం ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్న ఆమె, శనివారం ఉదయం అదృశ్యమైంది. యువతి తల్లి ఫిర్యాదు మేరకు వెంగల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

14 రోజులుగా చేపలవేటకు వెళ్లని కారైక్కల్ జాలర్లు


క్రేన్ ద్వారా పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న జాలర్లు

పుదుచ్చేరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను, వర్షాల కారణంగా కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలోని కారైక్కల్ జిల్లాకు చెందిన జాలర్లు 14 రోజులుగా చేపలవేటకు వెళ్లడం లేదు. కారైక్కాల్ సముద్రతీర ప్రాంతంలో నిలిపిన దాదాపు 800లకు పడవలను తుపాను దాడికి గురికాకుండా ఆదివారం సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పుదుచ్చేరి, కారైక్కల్ ప్రాంతాల వైపుగా దిత్వా తుపాను కదులుతున్న కారణంగా ఈ ప్రాంతాల్లో అలలు ఉవెత్తున ఎగసిపడుతున్నాయి. మరోవైపు బంగాళాఖాతంలో ఈదురుగాలుల కారణంగ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరించింది.

రోడ్డు ప్రమాదంలో కౌన్సిలర్ సహా ముగ్గురి మృతి

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కౌన్సిలర్ సహా ముగ్గురు మృతిచెందారు. సురండై మున్సిపాలిటి కౌన్సిలర్ ఉషా ప్రభు, ఫ్లెస్సీ, అరుళ్ సెల్వం ఒకే బైక్‌లో ఆదివారం ఉదయం తెన్‌కాశి వైపు బయల్దేరారు. ఇరట్టైకుళం ప్రాంతంలో వస్తున్న బైక్‌ను మినీ లారీ ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదుచేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

చెన్నై-కోవై ఇంటర్ సిటీలో ప్రసవం

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై-కోవై ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన గర్భిణి మగశిశువుకు జన్మనిచ్చింది. బెంగళూరు లింగరాజపురానికి చెందిన సులైమాన్ ఖాన్ భార్య రజియాభాను (25) నిండు గర్భిణి. కొద్దిరోజుల క్రితం కృష్ణగిరి జిల్లా సామల్‌పట్టిలోని బంధువుల ఇంటికి సులైమాన్‌ఖాన్ భార్యతో వచ్చాడు. అక్కడి నుంచి తిరుప్పూర్ వెళ్లేందుకు శుక్రవారం సామల్‌పట్టి రైల్వేస్టేషన్‌కు వచ్చి, చెన్నై-కోవై ఇంటర్ సిటీ రైలులోని అన్ రిజర్వ్‌డ్ బోగీలో ఎక్కారు. రైలు బయల్దేరిన కొద్దిసేపటికి రజియాభానుకు నొప్పులు వచ్చాయి. బోగీలోని మహిళలు ఆమెకు ప్రసవం చేయగా, మగబిడ్డ జన్మించింది. ఈ విషయాన్ని ప్రయాణికులు 139 రైల్వే పోలీసు హెల్ప్ లైన్‌కు తెలియజేశారు. బొమ్మిడి రైల్వేస్టేషన్‌లో 108 అంబులెన్స్‌తో రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు సిద్ధమయ్యారు. రైలు బొమ్మిడి రైల్వేస్టేషన్‌కు చేరిన వెంటనే, రజియాభాను, పసికందును అంబులెన్స్‌లో ధైరనత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

● కరూర్ తొక్కిసలాట వ్యవహారం..

నేడు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రాక

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట వ్యవహారంపై సీబీఐ విచారణ పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సోమవారం కరూర్‌లో పర్యటించనున్నారు. కరూర్ వేలుచామిపురంలో సెప్టెంబరు 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. ఈ ఘటనకు సంబంధించిన సీబీఐ అధికారులు విచారణ చేపట్టారు. అలాగే, ఈ విచారణ పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలో ఇద్దరు ఐపీఎస్ అధికారులతో కూడిన బృందాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలోని బృందం సోమవారం కరూర్‌కు రానున్నట్లు సమాచారం.

తిరుచ్చిలో రూ.3 కోట్ల గంజాయి స్వాధీనం

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి విమానాశ్రయంలో రూ.3 కోట్ల విలువైన మేలురకం గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్ నుంచి గురువారం స్కూట్ విమానం తిరుచ్చి విమానాశ్రయానికి వచ్చింది. ఈ విమానంలో థాయ్‌లాండ్ నుంచి సింగపూర్ మీదుగా తిరుచ్చికి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేసి, 3 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి బహిరంగ మార్కెట్లో రూ.3 కోట్లు ఉంటుందని తెలిపిన అధికారులు, అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తప్పించుకున్న ఖైదీ... ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

అడయార్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలోని కోర్టుకు తీసుకెళ్లి తిరిగి తీసుకు వస్తున్న సమయంలో ఖైదీ తప్పించుకున్న వ్యవహారంలో ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటుపడింది. కోటయూర్‌కు చెందిన తమిళ్ సెల్వన్ (29)ను ఓ కేసులో అరెస్ట్ చేసిన పోలీసులు శ్రీవిల్లిపుత్తూర్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ తర్వాత తిరుగు ప్రయాణంలో అళగాపురి ప్రాంతంలో పోలీసు వాహనాన్ని ఆపిన హెడ్ కానిస్టేబుల్ మదనస్వామి, కానిస్టేబుల్ లింగరాజ్ ఖైదీతో కలసి హోటల్‌లో భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో, తమిళ్ సెల్వన్ తప్పించుకు పారిపోయాడు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ మదనస్వామి, కానిస్టేబుల్ లింగరాజ్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారి ఉత్తర్వులు జారీచేశారు.

పని అనుభవ పత్రాల అప్‌లోడ్‌కు అవకాశం

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పని అనుభవ ధృవీకరణ పత్రాల సమర్పణకు గడువు పొడిగించారు. ఈ మేరకు టీఆర్బీ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలు, ప్రభుత్వ విద్యా కళాశాలల్లో ఖాళీగా ఉన్న 2,708 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి అక్టోబరు 16వ తేది నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పణకు అక్టోబరు 17 నుంచి నవంబరు 10వ తేది వరకు అవకాశం కల్పించామన్నారు. అభ్యర్థులు తమ పని అనుభవ ధ్రువ పత్రాలను అప్‌లోడ్ చేసేందుకు నవంబరు 30వ తేది వరకు అవకాశం కల్పించామన్నారు. కానీ, పని అనుభవ ధ్రువ పత్రాల్లో సంబంధిత అధికారుల సంతకం చేయించడంలో జాప్యం జరుగుతోందని, ఈ పత్రాల అప్‌లోడ్‌కు అవకాశం కల్పించాలని అభ్యర్థులు టీఆర్బీకి విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థన పరిశీలించి, పని అనుభవ ధృవీకరణ పత్రాలను ఈ నెల 5వ తేది వరకు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించినట్లు టీఆర్బీ తెలిపింది.

గోడ కూలి యువతి మృతి


రేణుక (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలో ఇంటి గోడ కూలి యువతి మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. దిత్వా తుఫాను కారణంగా రాష్ట్రంలోని తీరప్రాంత జిల్లాలు, డెల్టా జిల్లాల్లో బలమైన గాలులతో వర్షం కురుస్తోంది. ఈక్రమంలో, కుంభకోణం సమీపంలో శనివారం రాత్రి గాలులతో భారీవర్షం కురిసింది. గాలుల దాటికి ఆ ప్రాంతంలో ఇంటి గోడ కూలడంతో, ఇంట్లో నిద్రపోతున్న రేణుక (20)పై శిథిలాలు పడి ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనలో రేణుక తండ్రి, తల్లి, సోదరుడికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీస్ స్టేషన్‌కు బాంబు బెదిరింపు

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయల్ పోలీస్ స్టేషన్‌కు బాంబు బెదింపులకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసు కంట్రోల్‌కు శనివారం ఫోన్ చేసిన అపరిచిత వ్యక్తి, మధురవాయల్ పోలీస్ స్టేషన్‌లో బాంబుందని తెలిపి ఫోన్ కట్ చేశాడు. ఈ బెదిరింపుతో అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో మధురవాయల్ పోలీస్ స్టేషన్, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. బెదిరింపులు వచ్చిన సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా విల్లుపురం జిల్లా విక్రవాండి తాలూకాకు చెందిన భూపతి (43)ని పోలీసులు అరెస్ట్ చేశారు. భూపతి నొలంబూర్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఐరన్ షాప్ నిర్వహిస్తున్నట్లు, గత అక్టోబరు 12వ తేది మధురవాయల్ ప్రాంతంలోని పార్క్‌లో బాంబు ఉంచినట్లు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. ఈ వ్యవహారంలో అతనిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కారణంగా భూపతి మళ్లీ పోలీస్ స్టేషన్‌కు బాంబు బెదిరింపుకు పాల్పడినట్లు విచారణలో తెలిసింది. భూపతిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు నగర పోలీసు శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆస్పత్రి వ్యాన్ ఢీకొని నర్సు మృతి


దీపిక (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి వ్యాన్ ఢీకొని నర్సు మృతిచెందిన ఘటన పెరంబూర్‌లో చోటుచేసుకుంది. పెరంబూర్ బందర్ గార్డెన్ ఆరుముగ ముదలి వీధికి చెందిన తుకారాముకు కుమార్తె దీపిక (22) థౌజండ్ లైట్స్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తోంది. శనివారం ఆస్పత్రికి తన స్కూటర్‌లో ఓట్టేరి డిడీర్ నగర్ మార్గంగా వెళుతోంది. అదే ఆస్పత్రికి ఉద్యోగులను తీసుకెళ్తున్న వ్యాన్, దీపిక వెళ్తున్న స్కూటర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో స్కూటర్ నుంచి కిందపడిన దీపిక తలపై వ్యాన్ వెనుక చక్రం దూసుకెళ్లడంతో, ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న కీల్పాక్కం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి వ్యాన్ డ్రైవర్ తంజావూరుకు చెందిన శీనివాసన్ (29)ను అరెస్ట్ చేసి, ఈ ప్రమాదం పథకం ప్రకారం జరిగిందా? అనే కోణంలో విచారిస్తున్నారు.

బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక అడయార్ రంగస్వామి గార్డన్‌కు చెందిన నాగరాజన్‌కు హరిహరన్ (17) అనే కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. హరిహరన్ నగరంలోని ఓ కళాశాలలో డిప్లొమో చదువుతున్నాడు. హరిహరన్ తనకు బైక్ కొనివ్వాలని తండ్రిని పలుమార్లు కోరాడు. వయస్సు తక్కువగా ఉన్న కారణంగా ఇప్పుడు బైక్ వద్దని నాగరాజన్ కుమారుడికి తేల్చి చెప్పాడు. కొద్దిరోజుల క్రితం హరిహరన్ తండ్రి బైక్ తీసుకెళ్లిన సమయంలో ప్రమాదానికి గురై గాయపడ్డాడు. ఈ ఘటనతో హరిహరన్‌ను తండ్రి తీవ్రంగా మందలించారు. ఈ కారణంగా, శుక్రవారం రాత్రి ఇంట్లోని గదిలో హరిహరన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై శాస్త్రి నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఉత్తమ టీచర్ విశ్వనాథన్‌కు అవార్డు


విశ్వనాథన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని సెయింట్ మేరీస్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ పాఠశాల వార్షికోత్సవం శనివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పాల్గొన్నారు. ఈ క్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడైన విశ్వనాథన్‌కు ఉత్తమ సైన్స్ టీచర్ అవార్డును ఎమ్మెల్యే చంద్రన్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మేట్టూరు డ్యాం సమీపంలో బస్సు బోల్తా

● పదిమంది అయ్యప్ప భక్తులకు గాయాలు



ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాం సమీపంలో టూరిస్ట్ బస్సు బోల్తా పడిన ఘటనలో 10 మంది అయ్యప్ప భక్తులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తిరువణ్ణామలై జిల్లా పట్టియానల్ ప్రాంతం నుండి శనివారం సాయంత్రం 47 మంది అయ్యప్ప భక్తులతో బయలుదేరిన టూరిస్ట్ బస్సు ఆదివారం ఉదయం మేట్టూరు డ్యాం ప్రాంతానికి చేరుకుంది. బస్సును ధర్మపురికి చెందిన డ్రైవర్ వేలు నడుపుతుండగా అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న 40 అడుగుల గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 10 మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. వారిని మేట్టూరు ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు పోలీసులు తెలిపారు.